క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రావులపర్రులో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు, హెల్త్ సిబ్బంది

ఉంగుటూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తూ దోమలను లార్వా దశలోనే నిర్మూలించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా చేయవచ్చునని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలో రావులపర్రులో గ్రామస్థాయిలో అమలువుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ఆరోగ్య సిబ్బంది ప్రశాంతి, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు రమణ, శారద ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

గ్రామ ఇంజనీరింగ్ సహాయకుల నిరసన



తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదుకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ సహాయకులు

ఉంగుటూరు: శాఖకు సంబంధంలేని పనులు తమకు కేటాయిస్తున్నారని గ్రామ ఇంజనీరింగ్ సహాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు సోమవారం తహసీల్దారు పూర్ణ చంద్రప్రసాదుకు, ఎంపీడీవో గంజిరాజ్ మనోజుకు వారు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఇంజనీరింగ్ పనులతోపాటు బూత్ లెవెల్ ఆఫీసరు, వెహికల్ మూమెంటు ఆఫీసర్లు, తదితర శాఖకు సంబంధం లేని పనులు తమకు కేటాయించడం వల్ల పని భారం పెరిగిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజనీరింగు అసోసియేషన్ పిలుపు మేరకు వారు ఆందోళన చేశారు. మండలంలోని ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం



వట్లూరు గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెదపాడు: వట్లూరులో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబరు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఆశ్రం ఆసుపత్రికి చెందిన గైనకాలజిస్టు, ఆర్థోపెడిక్, పీడియాట్రిస్టు, జనరల్ ఫిజిషియన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, ఆశాజ్యోతి పౌండేషన్ డైరక్టరు మాధవీలత పాల్గొన్నారు.

బ్రహ్మావతిని పరామర్శించిన జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు, మాజీ డిప్యూటీ మేయర్ గంపల బ్రహ్మావతిని ఆపార్టీ ఏలూరు సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్ సోమవారం పరామర్శించారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని ఆమె నివాసంలో పార్టీ నేతలతో కలిసి ఆయన పరామర్శించారు. బ్రహ్మావతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. రాబోయే కాలంలో పార్టీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్ గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, నాయకులు మద్దాల ఫణి, దాలి వెంకటేష్, సత్యనారాయణ, అట్టాడ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

లింగ వివక్ష అనాగరికం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు సమానంగా రాణిస్తోన్న స్త్రీలను తక్కువ చేసి చూడడం తగదని, లింగ వివక్షత అనాగరికమని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అన్నారు. నవంబర్ 25 నుంచి ఈనెల 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ కాంపెయిన్ నయీ చేతన 3.0లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మధ్యాహ్నం లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై వి.కాంతి ప్రియ మాట్లాడుతూ స్త్రీలపై హింసను నిరసిస్తూ, అలాంటి ఘటనలు జరిగినప్పుడు తెలియజేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్‌ను విద్యార్థులకు తెలిపారు. అనంతరం కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడారు. వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎస్ పరమేశ పాల్గొన్నారు.

ధాన్యం సంరక్షణకు రైతుల పాట్లు

- తుఫాన్ ప్రభావం తగ్గుముఖం
- ధాన్యాన్ని ఒబ్బిడి చేసే పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- దళారుల దందాతో రైతులకు తీవ్ర నష్టం
- ప్రభుత్వ సహకారం శూన్యం

గణపవరం/దెందులూరు: తుఫాన్ ప్రభావం నుంచి బయటపడిన రైతులు ఇప్పుడు తమ ధాన్యం అమ్ముకోవడానికి సమాయత్తం అవుతున్నారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు ధాన్యం తడవకుండా సంరక్షించుకోవడానికి నాలుగు రోజులుగా నానా పాట్లుపడ్డారు. తుఫాన్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో రైతులు తమధాన్యం నీటి పాలు కాకుండా కాపాడుకోగలిగారు. మిల్లర్లు మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు ఆపి వేయడంతో రైతులు తమ ధాన్యాన్ని పొలాల నుంచి పుంతల్లోకి, రోడ్ల మీదికి చేరవేసి బరకాలు కప్పి తడవకుండా కాపాడుకున్నారు. మొత్తానికి తుఫాన్ ముప్పు తప్పి సోమవారం వాతావరణ తెరిపి ఇవ్వడంతో రైతులు తమ ధాన్యం రాశులను మళ్లీ ఆరబెట్టుకుంటూ కనిపించారు.

ధాన్యం తడవకుండా ఏర్పాట్లు

తేమశాతం తగ్గడంతో రైతులు తమధాన్యాన్ని అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో తుఫాన్ హెచ్చరికలు రావడంతో ఎండబెట్టిన ధాన్యాన్ని ఎక్కడికక్కడ రాశులుగా చేసి టార్పాలిన్లు, ప్లాస్టిక్ బరకాలు కప్పి బలంగా తాళ్లతో కట్టి ఎంత వర్షం పడినా, ఈదురుగాలులు వీచినా ధాన్యం తడవకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు.

నిలిచిన వరికోతలు

కోతకు సిద్ధంగా ఉన్న పొలాలలను రైతులు తుఫాన్ హెచ్చరికలతో కోత కోయకుండా వదిలేయడంతో వర్షాలకు పైరు నేలకొరిగింది. గణపవరం, పిప్పర, మొయ్యేరు, అర్ధవరం గ్రామాల్లో కొంతమేర సార్వా పైరు నేలవాలింది. వర్షం ప్రభావం తక్కువగా ఉండటంతోపాటు సోమవారం రైతుల వరి కోతలకు సిద్ధమయ్యారు. తుఫాన్ కారణంగా రెండు రోజుల పాటు కొనుగోళ్లు నిలిపివేసిన మిల్లర్లు తిరిగి కొనుగోళ్ల ప్రారంభించడంతో రైతులు తమ ధాన్యం అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నారు. కొనుగోళ్ల మందకొడిగా జరుగున్నాయని అధికారులు చెబుతున్నారు.



గణపవరంలో భారీ వర్షానికి నేలకొరిగిన పైరు



దెందులూరు: ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



పెదవేగి : అమ్మపాలెం వద్ద వర్షం కురవడంతో ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతులు

దళారుల దగా.. మోసపోతున్న అన్నదాతలు

పెదవేగి : వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లి వారి కష్టాలు తెలుసుకుని భరోసా కల్పించేది. ప్రస్తుతం రైతుల అవస్థలు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ప్రస్తుతం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. గతంలో కల్లాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతుల వద్దకు గ్రామస్థాయిలోనే అధికారులు వెళ్లి రైతుకు మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వమే మద్దతు ధర అందించి ధాన్యం కొనుగోలు చేసేది. ప్రస్తుతం కూటమి సర్కారు రైతులకు కన్నీళ్లు మిగులుస్తోంది. ఒక వైపు ప్రకృతి విపత్తులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తే మరో వైపు అధికారుల నిర్లక్ష్యం రైతులను నిలువు దోపిడీకి గురి చేస్తోంది. దీంతో దళారుల దందాతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారుల ఆగడాలపై రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో మండలాల వారీగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దెందులూరు నియోజకవర్గంలో 43,103 వేల ఎకరాలు వరి సాగు చేయగా దీనిలో ఇప్పటికే 15,279 వేల ఎకరాల మేరకు కోతలు పూర్తయ్యాయి. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల మేరకు కోతలు కోసిన ధాన్యంలో 17 శాతం తేమ శాతం ఉండాలి. ఈ విధంగా ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకృతి విపత్తులను దృష్టిలో పెట్టుకుని ధాన్యంలో 25 శాతం తేమ ఉన్నప్పటికీ మద్దతు ధర చెల్లించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాస్తవ రూపంలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఇదే అదునుగా రైతుల వద్ద నుంచి దళారులు ధాన్యం కొనుగోలు చేస్తూ తక్కువ ధర ఇస్తున్నారు.

చిరిగిన గోనె సంచుల సరఫరా

ధాన్యం సేకరణ సమయంలో గోనె సంచులు సరఫరా చేస్తామని అధికారులు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ వాస్తరూపంలో కార్యరూపం దాల్చలేదు. రైతులకు చిరిగిన సంచులు అందించి అధికారులు చేతులు దులుపుకున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి విక్రయించే విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కల్లాల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎ గ్రేడు రకం ధాన్యం క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320 ఉండగా సాధారణ రకం రూ.2,300 ఉంది. కల్లాల వద్ద కొనుగోలు చేసినందుకు దళారులు బస్తాకు 5 కిలోలు తరుగు చూపించి రూ.1,900 అందిస్తున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని రూ.2వేలకు మాత్రమే దళారులు కొనుగోలు చేస్తున్నారు. దళారులు అదే ధాన్యాన్ని బయటి మిల్లర్లకు, కొనుగోలు కేంద్రాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తరహా దందా నియోజకవర్గంలో యదేచ్ఛగా సాగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

తక్కువ ధరకు అడుగుతున్నారు



నేను కొద్ది రోజుల క్రితం యంత్రంతో వరి పైరును కోయించాను. ధాన్యం కొలుగోలు కేంద్రం సమీపంలో లేకపోయే సరికి తెలిసిన దళారిని ధాన్యం ధర వివరాలు అడిగితే బస్తా రూ.1,900 చెల్లించి కొంటానని చెప్పాడు. మా గ్రామానికి కొనుగోలు కేంద్రం లేక, దూరం తీసుకెళ్లి విక్రయించలేని పరిస్థితుల్లో, వేరే దారి లేక 1,900 రూపాయలకే ధాన్యం విక్రయించాను.

– కొత్తపల్లి గోపిరాజు, రైతు, శ్రీరామవరం

దళారులను నమ్మవద్దు



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర బస్తాకు రూ.2,300 నుంచి రూ.2,320. బయట కాటాలు పెట్టి మాయమాటలు చెప్పి, తక్కువ ధరకు రైతుల దగ్గర దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రతి రైతు తనకు సమీపంలోని ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి నేరుగా ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలి. రైతు బ్యాంక్ అకౌంట్ నంబర్ ఇస్తే వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయి.

– వై సుబ్బారావు, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఏలూరు

చుక్కల్లో గుడ్డు ధర

- మార్కెట్‌లో రూ. 7 పలుకుతున్న గుడ్డు ధర
- ఉత్పత్తిలో 80 శాతం గుడ్లు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

దెందులూరు: మూడేళ్ల క్రితం కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైంది. చికెన్, గుడ్డు కారణంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందుతోందంటూ వదంతులు రావడంతో ఒక్కసారిగా పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పట్లో చికెన్ ధర పతనం కాగా గుడ్డు ధర సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.25కు పతనమైంది. అయితే కరోనా కట్టడిలో పౌష్టికాహారమైన కోడిగుడ్డు, చికెన్ ప్రాధాన్యం పెరగడంతో పాటు ప్రభుత్వం, వైద్యులు సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పౌల్ట్రీ పరిశ్రమకు కలిసి వచ్చింది. ఇటీవల గణనీయంగా గుడ్డు, చికెన్ వినియోగం పెరగడంతో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కోడిగుడ్డు నెక్ ధర రూ.6.50 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.7 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ధర గతంలో ఎప్పుడూ నమోదు కాలేదని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.

తగ్గిన ఉత్పత్తి

జిల్లాలో 160 వరకు పౌల్ట్రీలుండగా వీటిలో సుమారు 90 లక్షల వరకు కోళ్లు పెరుగుతున్నాయి. వీటి ద్వారా నిత్యం కోటిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. సాధారణ రోజుల్లో ఉత్తత్తిలో 80 శాతం మేర కోడిగుడ్లు పొరుగు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఒడిశా, అసోం, బీహార్ వంటి రాష్ట్రాలకు ఎగుమతవుతుంటాయి. మిగిలిన 20 శాతం స్థానికంగా వినియోగిస్తుంటారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా పౌల్ట్రీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన కృషితో పౌల్ట్రీ పరిశ్రమ మరోసారి నిలదొక్కుకుంది. సాధారణంగా వర్షాకాలం, శీతాకాలంలో గుడ్డు వినియోగం పెరుగుతుంది. ఎగుమతులకు డిమాండ్ పెరిగి ఏటా సీజన్‌లో రైతు ధర సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. వేసవిలో 20 శాతం వరకు ఉత్పత్తి పడిపోగా రోజుకు లక్ష కోళ్లు మృత్యువాత పడ్డాయి. మేత ధరలు సైతం గణనీయంగా పెరగడంతో రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. రిటైల్ మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7 వరకు విక్రయించే అవకాశం ఉంది. చలికాలంలో గుడ్డు వినియోగం పెరగడం, క్రిస్మస్, న్యూ ఇయర్ కేకుల తయారీలో వాడనుండటంతో రేట్లు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.



కోడిగుడ్లు విక్రయిస్తున్న వ్యాపారి

అమ్మో..కూర‘గాయాలు’



క్యారెట్



ఉల్లిపాయలు

- ఉల్లి ధర వింటే కన్నీరే
- ప్రజలకు చుక్కలు చూపిస్తున్న ఆకుకూరల ధరలు

గణపవరం: కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. కార్తీక మాసం ముగుస్తున్నా ఇంకా కూరగాయల ధరలు దిగిరాలేదు సరికదా, ఇప్పట్లో దిగివచ్చే సూచనలూ కనిపించడంలేదు. ఉల్లిధర రికార్డు స్థాయిలో కిలో రూ.80 పలుకుతోంది. క్యారెట్ ధర కూడా అదే స్థాయిలో ఉంది. మిగిలిన కూరగాయలూ మేమేమీ తక్కువ కాదంటూ వినియోగదారులను హడలుగొడుతున్నాయి. వారం కాదు పదిరోజులు కాదు దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి. ఒక్క కూరగాయల కొనుగోలు పైనే ప్రతి కుటుంబం నెలవారీ ఖర్చు కనీసస్థాయిలో వెయ్యి రూపాయల వరకూ పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. కార్తీకమాసంతో కూరగాయల ధరలు కొద్దిగా పెరగడం సహజం. కానీ కార్తీకమాసంలో కూరగాయల ధరలు హడలెత్తిస్తున్నాయి. డైలీ మార్కెట్‌లో కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వారపుసంత రోజు వరకూ ఎదురు చూసినా అక్కడా అవే ధరలు ప్రజల గూబగుయ్యిమనిపిస్తున్నాయి. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. దీనితో ప్రజలు కూరగాయల కొనుగోళ్లు సగానికి సగం తగ్గించేశారు. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో వివిధ రకాల కూరగాయల ధరలూ పరిశీలిస్తే ఉల్లి కిలో రూ.70, పచ్చిమిర్చి రూ.80, బీర రూ.60, వంకాయలు రూ.80, బెండ రూ.60, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.70, దోస రూ.30, దొండ రూ.60, కాకర రూ.60, కీరదోస రూ.80, కందరూ.50, చిక్కుడు రూ.120, టమాట రూ.60, అల్లం రూ.130, మునగ రూ.10, ఆనబ రూ.30 చొప్పున పలికాయి. ఆకుకూరల ధరలూ భగ్గుమన్నాయి. తోటకూర, గోంగూర, పాలకూర తదితర రకాలు కట్ట రూ.20 చొప్పున విక్రయించారు.

భక్తిశ్రద్ధలతో పోలి స్వర్గం పూజలు

భీమడోలు: కార్తీక మాసోత్సవాలు ముగింపును పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున భక్తులు పోలిస్వర్గం వేడుకను వైభవంగా నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. నిర్మలమైన భక్తికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా ఈ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అమవాస్య రావడంతో కార్తీక మాసం చివరి రోజైన మార్గశిర శుద్ధ పాడ్యమి రోజున పోలిని స్వర్గానికి సాగ నంపారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు తదితర గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు, పెద్దలు భారీ సంఖ్యలో గోదావరి కాలువలో స్నానాలాచరించారు. భక్తులు అరటి దొప్పల్లో దీపాలను వెలిగించి గోదావరి కాలువలో వదిలి మొక్కు తీర్చుకున్నారు. భీమడోలు వినాయకుడు, అయ్యప్ప స్వామి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసారు.

కార్తీకమాస చివరి రోజు కావడంతో మండలంలో ప్రత్యేక పూజలు

దెందులూరు: కార్తీకమాసం చివరిరోజు కావడంతో దెందులూరులోని పలు శివాలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో జమ్మి, ఉసిరి వృక్షాలకు పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు చేశారు. పోతునూరు, దోసపాడు, కొవ్వలి, దెందులూరు, జోగన్నపాలెం, శ్రీరామవరం, చల్లచింతలపూడి గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరులో రాదండు ఆధ్వర్యంలో బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో పోలిని స్వర్గానికి పంపే శుభదినాన్ని పురస్కరించుకుని 3,116 దీపాలతో శివలింగాకరంలో దీపాలను అలంకరించారు. రామదండు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గాలాయగూడెంలో అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు శిలలింగ కారం, ఓంకారంలో దీపార్చన చేశారు.



బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగం



భీమడోలు గోదావరి కాలువలో దీపాలను వదులుతున్న భక్తులు



గోదావరి కాలువ గట్టుపై పూజలు చేస్తున్న మహిళలు

మద్యం విక్రయాలు నిలుపుదల

పెదపాడు: శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో కలెక్టరు ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు మద్యం అమ్మకాలు నిలుపుదల చేయాలని పెదపాడు తహసీల్దార్ కృష్ణ జ్యోతి తెలిపారు. ఈనెల 3వతేదీ సాయంత్రం 4గంటల నుంచి 5తేదీ సాయంత్రం 4గంటల వరకు మద్యం అమ్మకాలు నిలుపుదల చేయాలని తెలిపారు. మద్యం షాపులు, బార్లు, కల్లు దుకాణాలను మూసివేయాలని షాపు యజమానులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సబ్‌స్టేషన్ పరిధిలోని కండక్టర్ మార్పు కారణంగా ఈనెల 3వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు ఆపరేషన్ ఈఈ కేఎం అంబేద్కర్ సోమవారం రాత్రి తెలిపారు. కండక్టర్ మార్పు కారణంగా గుండుగొలను, నాగహనుమన్ ఇండస్ట్రియల్, సూరప్పగూడెం, పోలసానిపల్లి అగ్రికల్చరల్, సూరప్పగూడెం తదితర ప్రాంతాల్లో హెడ్ క్వార్టర్ ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

మహారాష్ట్ర 7వ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలి జడ్జి, ఏలూరు వారి కోర్టులు.
E.P.5/2017 in O.S.No.125/2011
Between:
1). [illegible] (Died.)
2). శ్రీమతి [illegible]
3.) శ్రీమతి [illegible] .. D.HRs
AND
[illegible] ... JDR
[illegible] JDR [illegible] 18.12.2024 [illegible] 10.30 [illegible]
[illegible]
JDR [illegible]
R.S No. 438 [illegible] AC 3-82 [illegible]
[illegible] AC 3-82 [illegible]
DHR [illegible] రూ.13,67,000/-
[illegible] రూ.16,44,000/-
[illegible]
సెల్ -9440188408

గోపన్నపాలెంలో నాగేంద్రస్వామికి పూజలు

దెందులూరు: కార్తీకమాసం ముగింపు సందర్భంగా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని నాగేంద్ర స్వామి ఆలయంలో పోలి పాడ్యమి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం గ్రామస్తులందరూ ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు నిర్వహించిన కార్తీక మాస పూజల ముగింపు సందర్భంగా కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

పెదపాడు: తుఫాన్ నేపథ్యంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రైతులకు సూచించారు. సోమవారం పెదపాడు మండలంలోని సత్యవోలులో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఇటీవల చైర్ పర్సన్ మామయ్య ఘంటా రంగారావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన పరామర్శించి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నాయకులు ఘంటా ప్రసాదరావు, బొమ్మి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

గణపవరం: మహిళల అభ్యున్నతికి చదువు ఎంతో దోహద పడుతుందని, ప్రతి మహిళ చదువుతో ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశం ఉందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. సోమవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి మహిళా సాధికారత విభాగం, జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో లింగ వివక్ష వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు హైస్కూలు, కళాశాల స్థాయిలో చదువు మధ్యలో ఆపేసిన బాలికల ఇళ్లను సందర్శించి వారికి చదువు ప్రాముఖ్యతను వివరించారు. బాలికల చదువుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పలు పథకాలను వివరించారు. మహిళల అభ్యున్నతికి చదువు ఎంతో ఉపయోగపడుతుందని అవగాహన కల్పించారు. గణపవరం, సరిపల్లె గ్రామాలలో హైస్కూలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో చదువు మధ్యలో మానేసిన బాలికల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీకాలేజి మహిళా సాధికారత విభాగం కన్వీనర్ స్వరూపరాణి, సోషల్‌వర్క్ అధ్యాపకుడు జి.వెంకట్రావు, కామర్స్ అధ్యాపకుడు వెంకన్నబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బాలికలకు విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నగరంలో అభయ రక్షక పోలీస్ దళం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మహిళలు, విద్యార్థినులు ఆపదలో అండగా నిలిచేందుకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేక శ్రద్ధతో అభయ మహిళా పోలీస్ రక్షక దళం ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా ఎస్సై క్రాంతి ప్రియ నగరంలో అభయ రక్షక దళం గస్తీపై అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఏలూరు నగరానికి వచ్చే సందర్భంలో ఆటోల్లో ప్రయాణిస్తూ ఉంటారని, ఒంటరి మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లుకు ఉందని అన్నారు. ఎవరైనా ఆకతాయిలు ఆటోల్లో మహిళలు, బాలికలు ప్రయాణించే సమయాల్లో వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఆటో డ్రైవర్లు ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఆర్ పేట, వన్‌టౌన్‌లోని కస్తూరిబాయ్ స్కూల్ తదితర ప్రాంతాల్లో సరైన కారణాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న విద్యార్థులను గమనించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
90102 23729
79955 66352
Office mail : tpgadvt@gmail.com